క్లుప్తంగా

నేడే లక్ష్మీగణపతి హోమం

గుడివాడటౌన్: స్థానిక మెయిన్‌రోడ్‌లో వేంచేసి యున్న శ్రీవిఘ్నేశ్వరస్వామి వారి దేవస్థానంలో శుక్రవారం శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి వై.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొనదలచిన భక్తులు రూ. 516 చెల్లించి తమ గోత్రనామాలను నమోదు చేసుకుని పూజలో పాల్గొనలని కోరారు.

వృద్ధులకు చీరలు పంపిణీ



గుడివాడటౌన్: శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం సేవా కార్యక్రమాలలో భాగంగా గురువారం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్ మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా కలవలపల్లి గ్రామానికి చెందిన యాదవ ప్రముఖులు తాతా చంద్రశేఖర్ వితరణతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఐదేళ్లగా చంద్రశేఖర్ ఇక్కడ కార్యక్రమాల్లో పాల్గొని వితరణ అందజేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో మాకుల సత్యం, జాజుల తాతారావు, కె.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్లు లేకపోతే కఠినచర్యలు : సీఐ

గుడివాడరూరల్: వన్‌టౌన్ పరిధిలో నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ గురువారం హెచ్చరించారు. వేలకు వేలు ఖర్చు పెట్టి ప్రభుత్వాలు, ప్రజలు, వ్యాపార సంస్థలు, స్వచ్ఛందసంస్థలు ముఖ్యమైన కూడళ్లలో రోడ్లు, ఇళ్లవద్ద నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తుంటే, కొందరు వ్యక్తులు నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడుపుతున్నారన్నారు. దీంతో చోరీలు, నేరాలకు పాల్పడుతున్నవారిని గుర్తించడం కష్టమవుతుందన్నారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఆర్టీవో ద్వారా జారీచేసిన నంబర్‌ప్లేట్లను వాహనదారులంతా తమ వాహనాలకు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనదారులంతా తప్పకుండా నంబరుప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలని, లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

పాస్టర్ల సమావేశం



పామర్రు: క్రైస్తవ సంక్షేమమే లక్ష్యంగా సంఘ సభ్యులంతా పనిచేయాలని పామర్రు క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షులు రెవరెండ్ సాల్మన్ కొల్లాబత్తుల సూచించారు. స్థానిక చాట్లవానిపురంలోని విజన్ లైఫ్ సెంటర్‌లో గురువారం పామర్రు మండల పాస్టర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవుల సంఘటితంగా ఉన్నప్పుడు మాత్రమే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. అప్పుడే క్రైస్తవుల సంక్షేమం అభివృద్ధి సాధ్య పడుతుందని పేర్కొన్నారు. క్రైస్తవులకు ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించాలని, క్రైస్తవ విద్యార్థుకు ప్రత్యేక ఉపకార వేతనాలను అందజేయాలని కోరారు. అనంతరం పాస్టర్ కొండవీటి ప్రదీప్‌ను పాస్టర్లంతా కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యవర్గసభ్యులు టీ షాలేంరాజు, జీ సత్యకుమార్, ఎం సామ్యూల్, వీ ఆదాములు, పీటీపీఎఫ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సాయినాథునికి ప్రత్యేక పూజలు

పామర్రు: పుష్యమాసం ముక్కనుమను పురస్కరించుకుని స్థానిక సాయినగర్‌లోని శ్రీ షిర్డిసాయిబాబా ఆలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. తొలుత కాగడా హారతిలో ఆలయంలో కార్యక్రమాలను ప్రారంభించారు.అనంతరం పంచామృతాలతో, నవరసాలతో,సుగంధ ద్రవ్యాలతో సాయిబాబాను విశేషంగా అభిషేకాలు చేసినట్లు ఆలయ ధర్మకర్త తమ్మా వినోద్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు సాంబశివరావు, కాశీ,రమేష్, సురేష్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ జాతర



దగ్గుమిల్లిలో జరుగుతున్న గంగానమ్మ జాతర మహోత్సవం

పామర్రు: సంక్రాంతి పండుగ ముక్కనుమ నేపథ్యంలో పలుగ్రామాలలో గంగానమ్మ తల్లి సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. గంగానమ్మ తల్లికి జాలాభిషేకం చేశారు. అమ్మవారిని పసుపు కుంకుమలతో నూతన వస్త్రాలతో అలంకరించారు. అనంతరం గ్రామవీధుల్లో జాతర మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. మేళ తాళాలతో డప్పు వాయిద్యాలతో చిన్న పెద్ద అందరూ కలిసి జాతర మహోత్సంలో పాల్గొన్నారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

సమాచార హక్కు చట్టంపై చిన్నచూపు!

- సమాచార హక్కుచట్టంపై అవినీతి అధికారుల అలసత్వం..
- బోర్డులు కూడా ఏర్పాటు చేయని పలుశాఖల అధికారులు
- ప్రజల్లో కొరవడుతున్న అవగాహన
- పాలకుల తీరుతో నానాటికీ కనుమరుగవుతున్న చట్టం



సమాచారహక్కు చట్టం బోర్డు కూడా లేని గుడ్లవల్లేరు గ్రామ సచివాలయం



సమాచారహక్కు చట్టం వివరాల బోర్డు లేని గుడ్లవల్లేరులోని స్త్రీశక్తి భవనం

గుడ్లవల్లేరు: ప్రభుత్వ పాలనలో జరుగుతున్న మంచిచెడుల సమాచారంపై ప్రతి పౌరుడు అవగాహన పెంచుకునేందుకు ప్రజలకు అందుబాటులో ఉన్న పాశుపతాస్త్రం..సమాచారహక్కు చట్టం. అయితే కొంతమంది అవినీతి అధికారులు తమ బాగోతాలు బట్టబయలు కాకుండా ఉండేందుకు ఈ చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించాల్సిన అధికారులే దీనిపై చిన్నచూపు చూస్తున్నారు. ఇటువంటి అధికారుల అలసత్వం కారణంగా సమాచార హక్కు చట్టంపై నేటి యువతలో అవగాహన కొరవడుతోంది.

కనిపించని సమాచార బోర్డులు..

సమాచార హక్కు చట్టం 2005మే 11వ తేదీన అమల్లోకి వచ్చింది. ప్రభుత్వ కార్యాలయాలతోపాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లో అవినీతి, అక్రమాల నియంత్రణకేగాక ప్రభుత్వ పథకాల్లో అవకతవకలను ఈ చట్టంతో నియంత్రించవచ్చు. కాని ఆయా కార్యాలయాల్లో సమాచారహక్కు చట్టం ప్రాధాన్యతను వివరిస్తూ సమాచార బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉండగా, గుడ్లవల్లేరు మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా బోర్డులు మచ్చుకైనా కానరావడం లేదు. ఈ బోర్డులో ఆయా కార్యాలయంలో అప్పిలేట్ అధికారి పేరు, ఫోన్‌నంబరుతో సహా వివరాలను తెలియజేయాల్సి ఉన్నప్పటికీ ఆయాశాఖల అధికారులు అవేమి పట్టించుకోకపోతుండటం గమనార్హం. కొన్ని కార్యాలయాల్లో ఈ చట్టం అములులోకి వచ్చినపుడు ఏర్పాటు చేసిన బోర్డులే తప్ప, సదరు కార్యాలయ అధికారి బదిలీ జరిగినపుడు ఆస్థానంలో కొత్తగా వచ్చిన వారి పేరు, ఇతర వివరాలను మార్పు చేయకుండా అలానే వదిలివేస్తుండటం గమనార్హం. దీంతో సమాచార హక్కు చట్టం ఒకటి ఉందనే సమాచారం కూడా రోజురోజుకు మరుగునపడిపోతోంది.

లొసుగులు వెలుగుచూస్తాయనే..

సమాచార హక్కు చట్టంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తే తాము చేసిన లొసుగులు బట్టబయలు అవుతాయనే అలజడి కొందరు అవినీతి అధికారుల్లో ఉంది. మరోవైపు ఎక్కడ పని భారం పెరుగుతుందోనని ఉద్దేశంతో కూడా పలువురు అధికారులు ఈ చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. సమాచార హక్కుచట్టం కింద ఆయా సమాచారం కోరుతూ దరఖాస్తు చేసుకున్నవారికి శాఖల వారీగా నిర్ణీత కాలంలో అడిగిన పూర్తిస్థాయి సమాచారాన్ని ఇవ్వవలసి ఉంటుంది. ఈ పరిణామాలన్నీ అధికారులకు ఇబ్బందులు కలిగిస్తాయని, అందుకే ఈచట్టంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఈచట్టం అమల్లోకి వచ్చి 19ఏళ్లు గడుస్తున్నా...కొంతమంది అవినీతి అధికారులు మాత్రం దీనిని ప్రజల్లోకి వెళ్లనీయకుండా మోకాలడ్డుకుంటున్నారనే చెప్పాలి. గుడ్లవల్లేరు మండలంలోని ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారాన్ని కోరే దరఖాస్తు ఫారాలు కూడా అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఇలా సమాచారహక్కు చట్టం అమలుతీరుపై అధికారులు వ్యవహరిస్తున్న నిర్లక్ష్యపు వైఖరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అవినీతి బయటపడకూడదనే...



ప్రభుత్వ కార్యాలయాల్లో కొందరు అవినీతి అధికారులు తాము చేసే అవినీతి బయట పడకుండా ఉండేందుకే సమాచార హక్కు చట్టం గురించి సమాచార బోర్డులను ఏర్పాటు చేయడం లేదు. ప్రభుత్వ కార్యాలయాలతోపాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లో అవినీతి, అక్రమాల నియంత్రణకు ఈ చట్టం ఉపయోగపడుతుంది.

– షేక్ నజీర్, సామాజిక కార్యకర్త

అవగాహన చాలా అవసరం...



సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యపరచడం చాలా అవసరం. కేవలం అవినీతి అధికారుల కోసమే ఈ చట్టం కాదు...సామాన్యుని చేతిలో అస్త్రం వంటి ఈచట్టంతో భారీ కుంభకోణాలను వెలుగు చూసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ప్రభుత్వ పథకాల్లో అవకతవకలను ఈచట్టంతో వెలికి తీయవచ్చు.

– జంపాన శ్రీనివాస్‌గౌడ్, యూనిటైడ్ ఫోరం ఫర్ యూఎఫ్ ఆర్‌టీఐ రాష్ట్ర కోకన్వీనర్

బోర్డులు ఏర్పాటు చేయాలి...



ఈ చట్టాన్ని ఎవరూ తమ వ్యక్తిగత లాభాపేక్షకు ఉపయోగించడం తగదు. కొందరు ఈ చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ స్వార్థ చింతనకు లోనవుతున్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలి. కార్యాలయాల్లో ఈ చట్టానికి సంబంధించిన సమాచారం అందించే అధికారుల పేర్లను బోర్డుల్లో నమోదు చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– గాలంకి నాగేంద్రరావు, సామాజిక వేత్త

న్యూఇయర్ క్యాలెండర్ ఆవిష్కరణ



పామర్రు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు నియోజకవర్గ మాజీఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తన కార్యాలయంలో గురువారం నూతన సంవత్సరం–2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, ఎంపీటీసీలు తాడిశెట్టి శ్రీనివాసరావు, వంశీ, పార్టీ నాయకులు మర్రెడ్డి కాశీరెడ్డి, బొమ్మారెడ్డి అప్పిరెడ్డి, కొక్కిలిగడ్డ ఆనంద్, వేల్పూరు బోసు, పద్మ, చోరగుడి మర్రి బాబూరావు, పమిడిముక్కల, పామర్రు మండలం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



ముదినేపల్లిరూరల్: అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి స్థానిక వైద్యుడు అంబుల మనోజ్ గురువారం ఆర్థిక సాయం అందజేశారు. కొరగుంటపాలేనికి చెందిన ముచ్చు వెంకయ్య ఇల్లు బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. సమాచారం తెలుసుకున్న డాక్టర్ మనోజ్ తనకుమార్తె, వైద్యవిద్యార్థిని వైష్ణవి పేరున రూ.5 వేలు ఆర్థికసాయాన్ని వెంకయ్య కుటుంబీకులకు అందజేశారు.

పొగ బండ్లపై దృష్టి పెట్టరా?

- కాలం చెల్లిన వాహనాలతో కాలుష్యం
- ప్రయాణికుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు



పొగ వస్తున్న మినీవ్యాన్



పొగ వెదజల్లుతున్న ద్విచక్ర వాహనం

గుడివాడ టౌన్: కాలం చెల్లిన వాహనాలు రోడ్లపై సంచరిస్తున్నా వాటిని నియంత్రించడంలో ట్రాన్స్‌పోర్టు అధికారులు, పోలీసులు దృష్టి పెట్టకపోవడంతో వాటి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది. కాలం చెల్లిన వాహనం ఇంజిన్ మరమ్మతులు చేయించకపోవడం, ఇతర కారణాలతో అవి భారీగా పొగ వెదజల్లుతుంటాయి. ఈ నేపథ్యంలో పట్టణంలో భారీగా వీటి సవారీ సాగుతోంది. వాహనదారుడు కనీస ఆలోచన లేకుండా విపరీతంగా వేగం పెంచుతూ ప్రయాణించడంతో ఈ వాహనాలు యథేచ్ఛగా పొగను విడుదల చేస్తున్నాయి. దీంతో తోటి ప్రయాణికులు ఆ పొగ పీల్చలేక ఇబ్బందులు పడుతున్నారు. పాత వాహనదారుడు కనీస బాధ్యత లేకుండా వాహనాన్ని వాడటంతో వాతావరణ కాలుష్యానికి తెరతీసినట్లు అవుతోంది. ఈ వాహనం వెళ్లిన తరువాత కనీసం 15 నిముషాల పాటు పొగ తాలూకా వాసన వెదజల్లుతూనే ఉంటోంది. దీంతో ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై అధికారులు దృష్టిపెట్టి తక్షణమే వాటిని నియంత్రించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

గతంలో నోటీసులు ఇచ్చేవారు..

గతంలో ట్రాన్స్‌పోర్టు అధికారులు వాహనాల రిజిస్ట్రేషన్ తేదీని గుర్తించి ఒక ప్రత్యేక ఫార్ములా ద్వారా వాటి కాలపరిమితి పూర్తయిన వాహనాలను గుర్తించేవారు. ఆయా వాహనాల యజమానులకు నోటీసులు ఇచ్చి నియంత్రించగలిగేవారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగి పూర్తి సమాచారం సేకరించగల అవకాశాలు ఉన్నప్పటికీ ఈ ప్రక్రియ ఎందుకు జరగడంలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఒక ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి వీటిని నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

కట్టడికి చర్యలు తీసుకుంటాం

కాలం చెల్లిన వాహనాలపై ప్రత్యేక దృష్టిపెడతాం. సిబ్బందికి దీనిపై సూచనలు ఇచ్చి నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలకు నిఘా ఏర్పాటుచేస్తాం. నిబంధనలు అతిక్రమించే వారికి జరిమానా విధిస్తాం. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– జి.వి.ప్రసాదరావు, ట్రాఫిక్ ఎస్ఐ

'ఆటపాక'లో పర్యాటకుల సందడి



ఆటపాక పక్షుల కేంద్రం వద్ద పర్యాటకులు



ఆటపాక పక్షుల కేంద్రం వద్ద బోటు షికారు కోసం పోటీపడుతున్న యాత్రికులు

కైకలూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆటపాక పక్షుల కేంద్రంలో మూడురోజులుగా పర్యాటకులు సందడి చేశారు. ఏలూరు, పశ్చిమ గోదావరి, కృష్ణాజిల్లాల నుంచి గురువారం పెద్దఎత్తున యాత్రికులు కేంద్రాన్ని సందర్శించారు. ఇతర ప్రాంతాల నుంచి కోడిపందేలు తిలకించడానికి వచ్చిన ప్రజలు కైకలూరు–భీమవరం మర్గమధ్యంలో ఆటపాక పక్షుల కేంద్రాన్ని వీక్షించారు. బోటు షికారు వద్ద రద్దీ పెరిగింది. పోటీపడి మరీ బోటు షికారులో పెలికాన్, పెయింటెడ్ స్టోర్క్ పక్షులను వీక్షించారు. కేంద్రం సమీపంలోని పక్షి నమూనా మ్యూజియాన్ని ఎక్కువమంది చూశారు. చిల్డ్రన్స్ పార్కులో చిన్నారులు ఆటలాడుకున్నారు. అటవీశాఖ డిప్యూటీ రేంజర్ రంజిత్‌కుమార్, బీటు ఆఫీసర్ రాజేష్ పర్యాటలకు పక్షుల విశేషాలు, కొల్లేరు భౌగోళిక పరిస్థితులపై వివరించారు. శీతాకాలం పక్షుల వీక్షణకు అనువైన కాలమని ప్రజలు వలస పక్షుల అందాలను వీక్షించాలని కోరారు.

నేటి ధర్నాకు తరలిరావాలని పిలుపు



విలేకరులతో మాట్లాడుతున్న జి.నాగేశ్వరరావు తదితరులు

గుడివాడటౌన్: రైతుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని రైతుసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి జి.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల వచ్చిన బుడమేరు ముంపు కారణంగా నష్టపోయిన రైతులకు రైతులకు నేటికి నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. బీమా పరిహారం చెల్లించాలని, అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 20వేలను వెంటనే రైతు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరణ తదితర అంశాలపై విజయవాడ ధర్నాచౌక్‌లో జరిగే ఈ కార్యక్రమానికి రైతులంతా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి, శొంఠి ఉమామహేశ్వరరావు, ఎస్.వెంకటకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వవిద్యార్థులు

నందివాడ: నందివాడ మండలం రుద్రపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 1999–2000 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు 25ఏళ్ల తర్వాత గురువారం గెట్ టు గెదర్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో కలిశారు. పూర్వవిద్యార్థులంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. చదువుకున్న నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందోత్సాహాలతో గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు

ఎంపీటీసీ ప్రభాకర్ కన్నుమూత



ప్రభాకర్(ఫైల్)

గుడ్లవల్లేరు: వైఎస్సార్ సీపీ కూరాడ ఎంపీటీసీ కొండ దాసు ప్రభాకర్(64) గురువారం కన్నుమూశారు. కొంతకాలంగా కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన భౌతికకాయానికి శుక్రవారం అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రభాకర్ మృతి విషయం తెలుసుకున్న పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు.

గడ్డివాము దగ్ధం

మండవల్లి: మండలంలోని లింగాలలో చందు నాంచారయ్యకు చెందిన నాలుగెకరాల వరిగడ్డివామి గురువారం ప్రమాదవశాత్తూ దగ్ధమైంది. కైకలూరు అగ్నిమాపకశాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.30 వేల ఆస్తినష్టం సంభవించినట్లు అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్



క్రికెట్ క్రీడాకారులతో పోలీసులు

కైకలూరు: సంక్రాంతి పండగ సమయంలో యువత జూదాలకు ఆకర్షితులు కాకుండా పోలీసుశాఖ కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన కైకలూరు పోలీస్ ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా కొనసాగుతోంది. నియోజకవర్గ స్థాయిలో టోర్నమెంట్‌కు మొత్తం 45 జట్లు పాల్గొంటున్నాయి. టోర్నమెంట్‌లో భాగంగా గురువారం హ్యారి పాట్టర్స్ హిట్టర్స్ జట్టు టాస్ గెలిచి 14.3 బాల్స్‌లో పది వికెట్ల నష్టానికి 87 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేసిన నాగరాజు లెవెన్స్ జట్టు 13.3 బాల్స్‌కు మూడు వికెట్ల నష్టానికి 88 పరుగులు సాధించి విజేతగా నిలిచింది. మరోమ్యాచ్‌లో గుర్వాయిపాలెం జట్టు, కలిదిండి లెవెన్స్ జట్టుపై గెలిచింది. ఈ సందర్భంగా పట్టణ సీఐ పి.కృష్ణ మాట్లాడుతూ ఈనెల 19న విజేతలకు బహుమతులను అందజేస్తామని తెలిపారు. టోర్నమెంట్ ఏర్పాట్లను టౌన్ ఎస్సైలు డి.వెంకట్‌కుమార్, ఆర్.శ్రీనివాస్ పర్యవేక్షిస్తున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు కోరుతూ నోటీసులు



సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలంటూ చర్చి ఫాదర్‌కు నోటీసు అందచేస్తున్న ఎస్ఐ చంటిబాబు



పామర్రులో విష్ణు ఆలయం అర్చకులను నోటీసులు అందజేస్తున్న ఎస్ఐ రాజేంద్రప్రసాద్

గుడివాడరూరల్: మండలంలోని దేవాలయాలు, చర్చిలు, మసీదులు, ఇతర ప్రార్థనా మందిరాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎస్.చంటిబాబు గురువారం కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఆలయాలు, చర్చిలు, మసీదుల వద్దకు వెళ్లి నిర్వాహకులకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నోటీసులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చోరీలు, ఇతర వ్యవహారాలను నియంత్రించేందుకు ముందస్తుగానే అన్ని ఆలయాలు, చర్చిలు, మసీదుల వద్ద ఆయా నిర్వాహకులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆలయ, చర్చిలు, మసీదుల నిర్వాహకులు పాల్గొన్నారు.

పామర్రు మండలంలో...

పామర్రు: దేవాలయాలు, చర్చిలు, మసీదులలో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పామర్రు ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్ కోరారు. స్థానిక విష్ణు ఆలయం వద్ద అర్చకులకు సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం ఆయన నోటీసులను దజేశారు. ఎస్ఐ మాట్లాడుతూ ఆలయాల వద్ద బంగారు, వెండి ఆభరణాలు ఉంచకూడదని సూచించారు. ఒకవేళ ఆభరణాలు ఉంచినచో వాటి సంరక్షణ బాధ్యత దేవస్థానం నిర్వాహకులు తీసుకోవాలని ఆదేశించారు. ఆలయ అర్చకులు ఆర్ ముకుంద, ఆర్ ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

66 మంది జూదరుల అరెస్టు

మండవల్లి: పోలీస్‌స్టేషన్ ఎస్సై రామచంద్రరావు, పోలీసు సిబ్బంది, జాయింట్ యాక్షన్ టీం కలిసి కోడి పందేల శిబిరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కోడి పందేలు, పేకాట, గుండాట ఆడుతున్న 66మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.48,450 నగదు, 18 కోడి పుంజులు, 18 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామచంద్రరావు గురువారం తెలిపారు.

కార్ డ్రైవింగ్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

మచిలీపట్నంటౌన్: నగరంలోని పాత రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న డాక్టర్ పట్టాభి మెమోరియల్ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 22వ తేదీ వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మహిళలకు టైలరింగ్, యువకులకు కార్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు ఉన్న వారు అర్హులని వివరించారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే స్పోకెన్ ఇంగ్లీష్‌లో కూడా శిక్షణ ఇస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం 93907 74782 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.